## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: కల్లెడ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. కల్లెడ సబ్ స్టేషన్ పరిధిలోని కల్లెడ, అనంతారం, గుట్రాజ్‌పల్లి, తక్కళ్లపల్లి, సంగంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్ గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఉద్యోగులకు నిరాశే మిగిలింది

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశే మిగిలిందని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూటీఎస్ ఎన్నికల సందర్భంగా మాట్లాడారు. పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా దాసరి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొయినపెల్లి ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అర్చకుడికి ఆర్థిక సాయం

కథలాపూర్: మండల ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఓ అర్చకుడికి రూ.15వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. రాఘవపేట గ్రామానికి చెందిన అలవాల ఆత్మారాం అనే అర్చకుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల కోసం మండల సంఘం తరఫున రూ.15వేలు అందించామని అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి మాధవచార్యులు తెలిపారు.

### ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాలిక్ అన్నారు. జిల్లా కేంద్రంలో కనీసం పార్కింగులు లేవని, డయాగ్నోస్టిక్ ల్యాబుల్లో పరీక్షలు నిర్వహించే పరికరాలు సైతం సక్రమంగా లేవన్నారు. పేద ప్రజల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

### కుష్టు వ్యాధి రహిత భారత్‌ను నిర్మించుకుందాం


అవగాహన కల్పిస్తున్న ఎర్యానాయక్

కోరుట్ల: భారతదేశాన్ని కుష్టు వ్యాధి రహిత భారత్‌గా నిర్మించుకోవాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎర్యానాయక్, హెల్త్ క్లబ్ కో–ఆర్డినేటర్ నీరజ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పర్శ్–కుష్టు వ్యాధిపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని కళాశాల హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యాధి కారణాలు, లక్షణాలు, చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కుష్టు వ్యాధిపై ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బూర్ల నరేష్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

### తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


పుస్తకాలతో వలంటీర్లు

మెట్‌పల్లి: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న పిల్లల కోసం పథకాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విజయవంతం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బూర్ల చంద్రశేఖర్‌గౌడ్ సూచించారు. డిగ్రీ కళాశాలలో శుక్రవారం వలంటీర్లకు పుస్తకాలను అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య, ఉపన్యాసకులు రాజేందర్, గట్టయ్య, నారాయణ, లింగం, భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములు కాపాడాలి



కోరుట్ల: పట్టణ శివారులోని ప్రభుత్వ భూములు సర్వే నంబర్ 1,311, రెండో వార్డులోని రామాలయం వెనక గుడి పంపు కాలువను పలువురు రియల్టర్లు కబ్జాలకు పాల్పడుతున్నారని, భూములను రక్షించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ ఎంఏ హమీద్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కోరుట్ల–మెట్‌పల్లి రోడ్డు 33 కేవీ సబ్ స్టేషన్ వద్ద సర్వే నెంబర్ 1,311 జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ మిగులు భూమిని అన్యాక్రాంతం చేస్తున్నారని, భూమిలో మున్సిపల్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

# చి‘వరి’కి అందని ఎస్సారెస్పీ నీరు

- చాలాచోట్ల దెబ్బతిన్న కాలువ
- ఎండుతున్న పంట పొలాలు


దెబ్బతిన్న కాలువ


నీరు లేక ఎండిన వరి పొలం

కోరుట్లరూరల్: మండలంలో ప్రవహించే ఎస్ఆర్ఎస్పీ కాలువ నీళ్లు చివరి ఆయకట్టు పొలాల వరకు చేరకపోవటంతో.. నీళ్లందక పలువురు రైతులకు చెందిన పొలాలు ఎండుతున్నాయి. సంగెం శివారు నుంచి కోరుట్ల శివారు జంబిగద్దె వరకు ఎస్ఆర్ఎస్పీ డీ38 కాలువ ఉంది. ఈ కాలువ కింద 458 ఎకరాల్లో పంట పొలాలు సాగవుతున్నాయి. యాసంగి సీజన్‌లో ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా వారబందీ పద్ధతిన నీళ్లు సరఫరా చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలకు కూడా అదే పద్ధతిన నీళ్లు సరఫరా చేస్తున్నారు. కాగా డీ38 కాలువ సంగెం శివారు నుంచి కోరుట్ల శివారు వరకు 2 కిలోమీటర్ల పొడవులో పలుచోట్ల దెబ్బతినటంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. దీంతో చివరి ఆయకట్టు వరకు నీళ్లు చేరక రైతులు వేసిన సుమారు 10 ఎకరాల్లో పొలాలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. కాకతీయ కాలువ వద్ద డిస్ట్రిబ్యూటరీ కాలువకు గేట్లు ఎక్కువగా ఎత్తితే నీళ్లు చిన్నచిన్న కాలువల ద్వారా వృథాగా పోయి వాగులో కలుస్తున్నాయి. గేట్లు తక్కువగా ఎత్తితే చివరి ఆయకట్టుకు నీళ్లు చేరటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల మరమ్మతులు చేపట్టి నీళ్లు వృథాగా పోకుండా చివరి ఆయకట్టు వరకు నీళ్లందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

#### ఎకరం పొలం ఎండింది

డీ38 కాలువ కింద రెండుచోట్ల సుమారు మూడున్నర ఎకరాల పొలం సాగు చేస్తున్న. వర్షాకాలం నీళ్లు బాగానే వచ్చాయి. యాసంగి వారబందీ పద్ధతిన వారం నీళ్లందక ఎకరం పొలం పూర్తిగా ఎండింది. కాలువ మరమ్మతు చేస్తే చివరి వరకూ నీళ్లందుతాయి.

– సుదవేణి భూమయ్య, రైతు, సంగెం

#### ప్రతిపాదనలు పంపించాం

డీ38 కాలువ పలుచోట్ల దెబ్బతినటంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు విడుదల కాగానే మరమ్మతులు చేపడతాం. ప్రస్తుతం గేట్లు ఎక్కువగా ఎత్తి నీళ్లు సరఫరా చేస్తున్నాం. చివరి ఆయకట్టు వరకు నీళ్లందేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్, ఏఈ, ఇరిగేషన్

# అభివృద్ధిని ఇంటింటా వివరించాలి


ధర్మపురిలో మాట్లాడుతున్న నాయకులు

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో చలో గర్ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటా వివరించాలని పిలుపునిచ్చారు. నాయకులు బెజ్జారపు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, గాజు భాస్కర్, దివిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను వివరించాలి**

మల్యాల: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించేందుకు గామ్ చలో.. బస్తీ చలో నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు అన్నారు. మండల కేంద్రంలో గామ్ చలో.. బస్తీ చలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రవాసి, సంయోజక్‌లను నియమించి ఈనెల 6 నుంచి 9 లోగా ప్రతి గ్రామంలో అక్కడే నిద్రించి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, గౌతమ్, బండారి రాజు, గాజుల మల్లేశం, రాజశేఖర్, కటుకం లత, గాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గద్దర్‌కు నివాళి


పాల్గొన్న నాయకులు

కథలాపూర్: మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలను చైతన్యం చేసేందుకు గద్దర్ పాడిన పాటలను పాడుతూ గుర్తు చేశారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గద్దర్ జన్మించిన మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల జిల్లా ప్రతినిధులు పొడేటి పాల్, బోదాస్ నర్సయ్య, కాశవత్తుల లక్ష్మిరాజం, బొడ్డు నరేశ్, తెడ్డు శేఖర్, మైస శ్రీధర్, కలిగోట రాజం, కేసరి సాయన్న, కదారి స్వామి, బాలె నీలకంఠం, రమేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### పల్లె దవాఖానాలో వైద్య సిబ్బందిని నియమిస్తాం

- డీఎంహెచ్‌వో శ్రీధర్

సాక్షి స్పందన

రాయికల్: అల్లీపూర్ గ్రామంలోని పల్లె దవాఖానాలో త్వరలోనే వైద్య సిబ్బందిని నియమిస్తామని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం సాక్షిలో పల్లె దవాఖానాలో సిబ్బంది కొరత అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. గతంలో ఆస్పత్రిలో పని చేసిన డాక్టర్ దీప్తి రాజీనామా చేశారని, త్వరలోనే వైద్య సిబ్బందిని నియమించి రోగులకు సేవలందించేలా కృషి చేస్తామన్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సైతం తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.

### ప్రభుత్వ కళాశాలలో వీడ్కోలు సమావేశం



జగిత్యాలరూరల్(సారంగాపూర్): బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నోడల్ అధికారి బి.నారాయణ, ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎంపీపీ మసర్థి రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు


కంటి పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల నియోజకవర్గానికి చెందిన నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు, ఎవరైనా ఉంటే నేరుగా వచ్చి చేసుకోవచ్చన్నారు. డాక్టర్ విజయ్, నాయకులు శ్రీనివాస్, ధర్మరాజు, జగదీశ్, శివకేసరిబాబు పాల్గొన్నారు.

**శారీరక దారుఢ్యం తప్పనిసరి**

విద్యతో పాటు శారీరక దారుఢ్యం ముఖ్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలకు చెందిన అభినయ్‌సాయి, అద్వైత్, ప్రీతమ్ స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్, బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా వీరిని అభినందించి మాట్లాడారు. నాయకులు శేఖర్, వంశీ, శరత్‌రావు పాల్గొన్నారు.

**వేతనాలు ఇప్పించాలని వినతి**

పెండింగ్‌లో ఉన్న వేతనాలిప్పించాలని మెప్మా రిసోర్స్‌పర్సన్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా వేతనాలు రావడం లేదని, ఇబ్బందిగా ఉందని, వేతనాలు మంజూరు చేసేలా చూడాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. మెప్మా నాయకులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ


ఇబ్రహీంపట్నం పంచాయతీలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన జెడ్పీ సీఈవో రఘువరన్

ఇబ్రహీంపట్నం: సర్పంచుల పదవీకాలం ముగియడంతో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా జెడ్పీ సీఈవో రఘువరన్, వర్షకొండ, ఎర్దండి పంచాయతీల ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. వేములకుర్తి, కోజన్‌కొత్తూర్‌లో ఎంపీవో కృపాకర్, ఎర్రాపూర్, కొమటికొండాపూర్‌లో ఎంపీడీవో ప్రభు, గోధూర్, కేశాపూర్‌లో భగీరథ ఏఈ మల్లేశం, తిమ్మాపూర్, తిమ్మాపూర్‌తండాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్‌లో ఇరిగేషన్ ఏఈ సుకన్య, మూలరాంపూర్, బర్ధిపూర్ పంచాయతీల్లో పీఆర్ ఏఈ అరుణ, అమ్మక్కపేట పంచాయతీ ప్రత్యేకాధికారిగా ఏవో దీపిక, డబ్బా పంచాయతీ ప్రత్యేకాధికారిగా పశు వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

**గ్రామాల అభివృద్ధిపై శ్రద్ధ వహించాలి**

మల్లాపూర్: ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు వేంపల్లి పంచాయితీ కార్యాలయాల్లో ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ వీర్‌సింగ్, కొత్తదాం రాజుపల్లి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో రాజశ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

**పెగడపల్లిలో..**

పెగడపల్లి: పెగడపల్లి, లింగాపూర్, కీచులాటపల్లి, శాలపల్లి గ్రామాలకు పుల్లయ్య ఎంపీడీవో, బతికపల్లి, వెంగళాయిపేట, రామబద్రునిపల్లి గ్రామాలకు హరిబాబు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, నందగిరి, ల్యాగలమర్రి గ్రామాలకు కీర్తన ఏఈ ఇరిగేషన్, అయితిపల్లి, దోమలకుంట, దీవికొండ గ్రామాలకు మహేందర్ ఎంపీవో, సుద్దపల్లి, ఎల్లాపూర్, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాలకు ఎంఏ ఫరూక్ తహసీల్దార్, నంచర్ల, ఆరవెల్లి గ్రామాలకు శంషేర్ అలీ ఏఈ పీఆర్, మద్దులపల్లి గ్రామానికి వేణుగోపాల్‌రావు జిల్లా వెటర్నరీ అధికారి, నామాపూర్, ఏడుమోటలపల్లి, నర్సింహునిపేట గ్రామాలకు విష్ణువర్ధన్ డిప్యూటీ తహసీల్దార్ ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.

**రాయికల్ మండలంలో..**

రాయికల్: మండలంలోని 32 గ్రామాల్లో అధికారులు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరికి పాలకమండలి సభ్యులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

# అభివృద్ధే ధ్యేయంగా పని చేశాం


గొల్లపల్లి: తాజా మాజీ సర్పంచ్‌కు సత్కారం


మల్లాపూర్: తాజా మాజీ పాలకవర్గ సభ్యులు

గొల్లపల్లి: అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని చిల్వాకోడూర్ తాజా మాజీ సర్పంచ్ కందుకూరి పద్మావతి అన్నారు. శుక్రవారం పద్మావతి, తాజా మాజీ ఉప సర్పంచ్ భద్రి రవి, వార్డు సభ్యులను గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

**వీడ్కోలు..**

మల్లాపూర్: వాల్గొండ, తండా పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం తాజా మాజీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. తాజా మాజీ సర్పంచులు దండిక గంగు, ధరంసోత్ కళావతి మాట్లాడుతూ.. మా పాలకవర్గ సభ్యుల సహకారంతో గడిచిన ఐదేళ్లు గ్రామాభివృద్ధికి కృషి చేశామన్నారు. ఎంపీటీసీ క్యాతం సుజాత, పంచాయతీ కార్యదర్శులు వసంత్, రవీందర్, నాయకులు క్యాతం నరేష్‌రెడ్డి, దండిక రాజన్న, ధరంసోత్ సురేందర్, మాజీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, కారోబార్లు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పశువులకు వైద్యం చేస్తున్న వైద్య విద్యార్థులు

జగిత్యాలరూరల్(సారంగాపూర్): పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ తక్కళ్లపల్లి మాధవరావు అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండలం పోచంపేట, అర్పపల్లి, రేచపల్లి గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలను నిర్వహించారు. రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని, వెటర్నరీ కళాశాల నుంచి అనేక రకాల వైద్యసేవలు రైతులకు అందిస్తారన్నారు. పశువుల్లో ప్రబలే వివిధ వ్యాధులు, వాటి నివారణ చర్యలు, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మండల పశు వైద్యాధికారి రాజేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంబిక, డాక్టర్ పర్శరాములు, డాక్టర్ సురేశ్, పశువైద్య శాఖ వైద్యులు తిరుపతిగౌడ్, రవీందర్, సునీల్, కళాశాల అధ్యాపకులు కృష్ణ దైద, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుష్మ, డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ విశాంక, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

### ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత


గుడిపేటలో రైతు పొలంలో పడిన చెట్టు

మల్యాల: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉండగా.. విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా ఏకంగా చెట్లనే కొట్టేస్తున్నారు. సామాన్యులు చెట్టు కొట్టేస్తే స్పందించే అధికారులకు విద్యుత్ అధికారులు చెట్లు కొట్టేస్తున్నా కానరావడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో నూకపల్లి గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లను కొట్టివేసిన స్థానికుడికి అప్పటి ఎంపీడీవో శైలరాజాణి జరిమానా విధించి మొక్కలు నాటించారు. హరితహారం పేరిట విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడం, విద్యుత్ తీగలకు తగిలి సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెట్లు కొట్టివేయడం ఆనవాయితీగా మారిపోయింది. దీనికితోడు చెట్లు కొట్టిన అనంతరం తొలగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవంతో వరి పొలాల్లో చెట్ల కొమ్మలు పడి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడిపేట గ్రామ శివారులో ఓ రైతు పొలం వద్ద విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు కొట్టేయాల్సిన అధికారులు.. పూర్తిగా చెట్లను కొట్టివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఉపాధిహామీ వార్షిక వేడుకలు


కథలాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కూలీలు

కథలాపూర్: భూషణరావుపేట, కథలాపూర్, కలిగోట, సిరికొండ, ఊట్‌పెల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కూలీలు, అధికారులు, నాయకులు కలిసి కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధిహామీ పథకం ప్రారంభమై 18 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవో జనార్దన్, బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, కూన సులోచన, బొంగు సత్యనారాయణ, బండి సత్తన్న, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

పెగడపల్లి: ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడుమోటలపల్లి ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్ కూలీలను కోరారు. పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పని ప్రదేశంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఇస్లావత్, రవినాయక్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశం, ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్రనాయక్, ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు.

### ఆదరిద్దాం.. అండగా నిలుద్దాం



జగిత్యాలటౌన్: వయోవృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించి అండగా నిలవాలని, వారి సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, బాధ్యతను విస్మరించేవారు శిక్షార్హులేనని జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ముద్రించిన సీనియర్ సిటిజన్ల పిలుపు పుస్తకం, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

### విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న త్రిపుర గవర్నర్

జగిత్యాల: నలంద డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి వరుణ్‌కుమార్ 12 రోజుల పాటు అయోధ్యకు సైకిల్ యాత్ర చేసి బాలరామున్ని దర్శించుకొని జగిత్యాలకు వచ్చాడు. ఈ సందర్భంగా త్రిపుర గవర్నర్ నల్ల ఇంద్రసేనారెడ్డి విద్యార్థిని అభినందించారు. విద్యార్థులు హిందూ ధర్మం కోసం ఇలాంటి సాహస యాత్రలో పాల్గొని ధర్మ పరిరక్షణలో భాగం కావడం అభినందనీయమన్నారు. ఆయన వెంట కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, తల్లిదండ్రులున్నారు.

### కమిటీ వేయండి

జగిత్యాల: జిల్లాలో అసైన్డ్ ల్యాండ్ చట్టం దుర్వినియోగం జరిగిందని, దానిపై కమిటీ వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సురేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలో అసైన్డ్ ల్యాండ్ చట్టం సెక్షన్ 2, సెక్షన్ 3 దుర్వినియోగం జరిగాయని, ఒక కమిటీ వేస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు.

### ఎల్‌ఈడీ బల్బులు అమర్చాలి



రాయికల్: పట్టణంలోని మెయిన్ రోడ్, హనుమాన్ రోడ్ వీధుల్లో ఉన్న స్తంభాలకు ఎల్‌ఈడీ బల్బులను అమర్చాలని కోరుతూ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ మాట్లాడుతూ.. ఎల్‌ఈడీ బల్బులు లేకపోవడంతో రాత్రి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు ఎద్దండి దివాకర్, మున్ను, బాపురపు నర్సయ్య, కడకుంట్ల నరేశ్, దాసరి గంగాధర్, రాజేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఘాట్ రోడ్డుపై భారీ వాహనం



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఘాట్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు వెళ్తున్నాయి. శుక్రవారం టిప్పర్ వెళ్లింది. కొండగట్టు బస్సు ప్రమాద అనంతరం అధికారులు ఘాట్ రోడ్డును మూసివేశారు. ఏడాది క్రితం కేవలం చిన్న వాహనాలకు మాత్రమే అనుమతి కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంపై వెంటనే పోలీస్, ఎండోమెంట్ అధికారులు స్పందించాలని అంజన్న భక్తులు, స్థానికులు కోరుతున్నారు.